క్లుప్తంగా

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాలీ కోర్సులో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని ఆ సంస్థ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్/ఫెయిల్ అభ్యర్థులు 18–26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. వివరాలకు 90004 87423 సంప్రదించాలన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 27, 28న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి పి. వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులు, పేదల పాలిట శాపంగా మారిన ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 అమలుచేయాలన్నారు. మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నగర అధ్యక్షుడు సుంకర రవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉక్కాయపల్లె గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్ వద్ద కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి హామీలు నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈనెల 21వ తేది కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ‘వంటా– వార్పు’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వి. శ్రీధర్‌బాబు, ఇ. ప్రకాష్, కిరణ్‌కుమార్, శివ పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుడు అరెస్ట్


కడప వైఎస్ఆర్ సర్కిల్ : బెల్ట్ షాప్ నిర్వహణకు అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం చింతకొమ్మదిన్నె మండలం జమాల్‌పల్లె గ్రామానికి చెందిన పఠాన్ సిరాజ్ ఖాన్ బెల్ట్ షాప్ నిర్వహణకు మద్యాన్ని తరలిస్తుండగా ఎస్సై జహీర్ ఆధ్వర్యంలో సిబ్బంది గుర్రం గుంపు వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఇతని వద్ద నుంచి దాదాపు 12 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

దుస్తుల పంపిణీ



కడప కల్చరల్ : కడప నగరంలోని బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత గ్రామమైన కాల భైరవపురంలో శుక్రవారం సంస్థ సభ్యులు కార్తీక్ రెడ్డి సోదరి సహజ జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు హరినాథ్ శ్రీనివాసులు, సంస్థ అధ్యక్షులు బాలాజీ రావు, బాసట సభ్యులు చంద్రమౌళి రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం



ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని బెల్ట్‌షాపులపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా అక్రమ మద్యం లేదన్నారు. గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై నిఘా ఉంచామన్నారు. ప్రభుత్వం మద్యం దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. జిల్లాలో మద్యాన్ని ఎంఆర్‌పీ ధరలకు అమ్ముతున్నామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ కోరారు. శుక్రవారం కడప యూటీఎఫ్ భవన్‌లో ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖ పరిధిలోకి తెచ్చి ఏడాది కాలం ముగిసినా ఇప్పటి వరకు వారి సర్వీసును విద్యాశాఖ నిర్ధారించలేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాదన విజయ్‌కుమార్, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

– ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించడంలో తమ ప్రభుత్వం సఫలీకృతమైందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష అన్నారు. శుక్రవారం ‘గడప గడపకు మన ప్రభుత్వం’లో భాగంగా... 3 వ డివిజన్‌లో వికలాంగుల కాలనీ, సైనిక్ నగర్, సప్తగిరి నగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్ని రాష్ట్రాలు ఉన్నా ఇంత గొప్పగా పేదల గురించి ఆలోచించి సంక్షేమ పథకాలు ఎవరూ అమలు చేయలేదన్నారు. సంవత్సరంలో ప్రతినెల క్యాలెండర్ పద్ధతిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు.

– ఉమ్మడిశెట్టి సరళ అనే మహిళ మాట్లాడుతూ తమకు ఇంటి స్థలం, ఇంటిని నిర్మించు కోవడానికి నగదు, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, జగనన్న వసతి దీవెన, వైఎస్ఆర్ చేయూత, జగనన్న విద్యా దీవెన, వైఎస్ఆర్ ఆసరా వంటి పథకాల ద్వారా రూ. 9,74,018 లబ్ధి చేకూరిందని, దీంతో మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నామని, మా చల్లని దీవెనలతో ఇలాంటి ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ

సైనిక నగర్ కాలనీలో మున్సిపల్ జనరల్ ఫండ్స్ నుండి రూ. 35 లక్షల అంచనా వ్యయంతో 4 సీసీ రోడ్ల నిర్మాణానికి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో 3వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ సుదర్శన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, తోట క్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, మియ్యా, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ ఇబ్రహీం మియా, గోపాలక్రిష్ణ, నాగేంద్రప్రసాద్, జింకా విజయలక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత సీఎం వైఎస్ జగన్

– జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట రూరల్ : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపజేసి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న అభివృద్ధి ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని కూచివారిపల్లి పంచాయతీలోని గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం వేడుకగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ముందుగా పంచాయతీ అభివృద్ధికి కేటాయించిన నిధుల పట్టికను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరి సంక్షేమం కోరి వారికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనం అండగా ఉందామని కోరారు.



జగనన్న కిట్‌లను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రజలకు జగనన్న కిట్‌లను అందజేశారు. తరువాత వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రెడ్డిమాసి రమేష్‌నాయుడు, సనిశెట్టి నవీన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, జేవీ కృష్ణారావు, వెలగచెర్ల గంగిరెడ్డి, పోలీ మురళీరెడ్డి, దండు గోపి, దాసరి పెంచలయ్య, ఎస్ జాకీర్, సాతపల్లి పెంచలయ్య, ఉదయకుమార్‌రెడ్డి, ఆర్.బాలాజీ, కోదండ, కె.కిషోర్‌కుమార్, కొండేటి కిషోర్‌కుమార్, రాఘవ, ఎంపీటీసీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడారంగానికి అధిక ప్రాధాన్యత

– ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



క్రీడాకారులతో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్రస్థాయిలో జరుగుతున్న 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 19 బాయ్స్ అండ్ గరల్స్ బేస్‌బాల్, టోర్నమెంట్‌ను కొరముట్ల ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో సత్తా చూపించే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అండర్ – 19 గేమ్స్ బేస్‌బాల్ క్రీడా పోటీలను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చదువుతోపాటు క్రీడలలో రాణిస్తే భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. చిన్నప్పటి నుంచి క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భవిష్యత్‌లో ఎదురయ్యే సమస్యలను అధికమించవచ్చన్నారు. క్రీడా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, సుధాకర్‌రాజు, సర్పంచ్ చంద్రశేఖర్, పీఈటీ శారద, భరత్‌కుమార్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి, విజయప్రసాద్‌రెడ్డి, అరుణ, సుబ్బరాజు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ట ఉత్సవాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో శ్రీ పోలేరమ్మవారి ఆలయ జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా యాగశాల ఏర్పాటు చేసి, హోమాలు నిర్వహించారు. గణపతి పూజ, అభిషేకాలు, అఖండ ప్రతిష్టాపన, ప్రధాన కలశస్థాపన, పరివార దేవతార్చనలు తదితర కార్యక్రమాలు నిర్వహించి, అంకురార్పణ చేశారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంత వేంకటేశ్వర స్వామి కుమారులు శ్రీ ఎస్.వెంకటాద్రిస్వామి, శ్రీ ఎస్.వీరభద్రస్వామి, ఎస్.వీరంభట్లయ్యస్వామి, ఎస్.దత్తాత్రేయస్వామి ఉత్సవాలు ప్రారంభించారు. శతాధిక ప్రతిష్ఠాపనాచార్య, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఇడమకంటి జనార్ధన శివాచార్య ఆధ్వర్యంలో వేలూరుకు చెందిన జ్యోతి మురుగాచార్య, పోలేపల్లె రామబ్రహ్మం, యలవర్తి ఆంజనేయశాస్త్రి వేద సంస్కృత పాఠశాల పూర్వపు శిష్య బృందం, మఠం ఆలయ అర్చకులు ఉదయం, సాయంత్రం విశేష పూజలు చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరికి చెందిన శ్రీ నటరాజ నాట్య కళాబృందం వారు నిర్వహించిన ‘శ్రీ సిద్ధయ్యగారి జ్ఞానమార్గం’ సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది.



హోమంలో పాల్గొన్న పూర్వపు మఠాధిపతి కుమారులు

– శ్రీ పోలేరమ్మవారి విగ్రహాన్ని ప్రొద్దుటూరు నుంచి బ్రహ్మంగారిమఠానికి తెచ్చి శ్రీవీరబ్రహ్మేంద్రస్వాముల వారి మఠంలోని గణపతి మంటపంలో గురువారం రాత్రి ధాన్యంలో ఉంచారు. శుక్రవారం ఉదయం పోలేరమ్మ గుడి వద్దకు తీసుకొచ్చి పూజా కార్యక్రమాల్లో కొలువు దీర్చారు. రాత్రి భక్తుల సమక్షంలో జలాధివాస కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కాంతులీనుతున్న ఆలయం

విద్యుత్ దీప కాంతులతో ఆలయం ధగధగలాడుతోంది. దేవుళ్ల, అమ్మవారుల ప్రతిమల ఆర్చ్‌లు ఆకట్టుకుంటున్నాయి. జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా మఠం ఫిట్ పర్సన్ సి.శంకరబాలాజి, మేనేజర్ ఎస్.ఈశ్వరాచారి ఆధ్వర్యంలో మఠం అధికారులు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న గీతాలాపన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో నామా ఎరుకలయ్య, కమాలక్షుమ్మ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి జీ సరిగమ ఫేమ్ పార్వతి ఆలపించిన గీతాలు ఆందరిని ఆకట్టుకున్నాయి. ఆమె అన్నమాచార్య కీర్తనలు, భక్తి పాటలు ఆలపించి అందరిని అలరించారు. ఎర్రగుంట్లకు చెందిన నడి ఊరు రామాలయం భజన బృందం తాళాల హరి భజన చేశారు. మధ్యాహ్నం విజయేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కాగా శనివారం సనాతన ధర్మంపై పసుపులేటి శంకర్ ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తారని, భక్తులు పాల్గొనాలని దేవాదాయశాఖ ఏసీ శంకర్ బాలాజీ కోరారు.



భక్తిగీతాలను ఆలపిస్తున్న పార్వతి

వేడుకగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలో శుక్రవారం అయోధ్యకు పంపేందుకు చేపట్టిన శ్రీరామ అక్షింతల శోభాయాత్ర వైభవోపేతంగా నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామమహేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్యకు వెళ్లే క్రమంలో అక్షింతలను కర్నూలు భరతమాత మందిరం నుంచి పూజలనంతరం ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చేర్చారు. అక్కడ వాటిని స్వామి సమక్షంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో కడప నగరం అల్మాస్‌పేటలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం సెంటర్‌కు చేర్చారు. అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి, ఈశ్వరీదేవిమఠం పీఠాధిపతి శ్రీ శివకుమార్‌స్వామిల ఆధ్వర్యంలో వీహెచ్‌పీ ప్రతినిధులు, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సహా కార్య విభాగం ప్రతినిధి బలరామకృష్ణ, ప్రచార ప్రముఖ్ సంజీవరెడ్డి, వెంకటశేషు, మురళీమోహన్‌రెడ్డి, బాలకృష్ణ యాదవ్, లక్ష్మినారాయణ, వీహెచ్‌పీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు అక్షింతలతో వచ్చిన వాహనానికి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి భక్తుల కోలాటాలు, భజనల సందడితో నగరంలోని ముఖ్య కూడళ్ల మీదుగా పాత బస్టాండులోని శ్రీ గాలిదేవర ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేర్చారు. అక్కడ అక్షింతలను స్వామి సన్నిధిలో ఉంచి పూజలు నిర్వహించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

– పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల టౌన్ : డిసెంబర్ నెలాఖరులోగా పులివెందుల మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందులను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇచ్చిన పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డికి పదోన్నతి లభించడంతో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు.

ఆర్థిక సాయం : పులివెందుల మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్(ఆప్కోస్) విధి నిర్వహణ సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన ఇద్దరు పబ్లిక్ హెల్త్ వర్కర్లకు రూ.5లక్షల నగదును వారు బాధిత కుటుంబాలకు అందజేశారు. సాధారణంగా మరణించిన 7 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మొత్తం రూ.24లక్షల మొత్తాన్ని వారు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల విజయవాడలో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రతి డ్రైవర్ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసినపుడే మన్ననలు పొందుతారన్నారు. బస్సును నడిపేటపుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి డ్రైవర్ బస్సులోని ప్రయాణీకులతోపాటు తన కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడపాలన్నారు. అలాగే కేఎంపీఎల్ సాధనకు ప్రతి డ్రైవర్ కృషి చేయాలని సూచించారు. అనంతరం బద్వేలు డిపో మేనేజర్ జీఎస్ రావు, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణారెడ్డిలు రోడ్డు ప్రమాదాలు జరిగే విధానాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కవి సమ్మేళనం



కవులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : ఒక్క అక్షరం తోడుంటే వంద మంది ఉన్నట్లేనని యోగి వేమన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వర్ రెడ్డి అభివర్ణించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కొండాయపల్లెలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో బహుభాషా కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మనిషికి చదువుకు మించిన ఆస్తి లేదని, బాగా చదివిస్తే వారికి కోట్ల రూపాయల ఆస్తిని ఇచ్చినట్లేనన్నారు. కార్యక్రమ అధ్యక్షులు, బీసీ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ మొబైల్ ఫోన్లు విద్యార్థులకు రాయడం, చదవడాన్ని దూరం చేస్తున్నాయన్నారు. విశిష్ఠ అతిథిగా హాజరైన పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్లను అవసరానికి మించి వాడటం ప్రమాదకరమని విద్యార్థులను హెచ్చరించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ నేతృత్వంలో రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు నిర్వహించిన బహుభాషా కవి సమ్మేళనంలో సంస్కృతం, ఉర్దూ, తెలుగుభాషల్లో దాదాపు 25 మంది కవులు గ్రంథాలయాలు, పర్యావరణం, పర్యాటకం, మానవత్వం, విలువలు తదితర అంశాలపై కవితాగానం చేసి ఆకట్టుకున్నారు. వారిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

వక్తృత్వ పోటీలు

కడప కల్చరల్ : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ మెయిన్ హైస్కూలులో నగర పరిధిలోని విద్యార్థులను మూడు విభాగాలుగా వక్తృత్వ పోటీ నిర్వహించారు. పుస్తకం, విలువలు, నాకు నచ్చిన కథ తదితర అంశాలలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ప్రసంగించారు. దాదాపు 250 మందికి విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారిణి ఎస్.నాగాంజలి తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి జరుగుతున్న 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక వివేకానంద హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : సీకేదిన్నె శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. శుక్రవారం సీకేదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రంథాలయ అధికారి పి.ఇబ్రహీం ఆధ్వర్యంలో 6, 7 తరగతి విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అలాగే శనివారం 8, 9వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 20వ తేదీ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేస్తామన్నారు.

ఇరువురు అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిలకలబావి, మోచంపేటలో నాటుసారాను విక్రయిస్తున్న కోటా నాగరాజును, షేక్ అబ్దుల్ జాఫర్‌లను అరెస్ట్ చేశారు. వారిలో ఒకొక్కరి నుంచి ఐదు లీటర్ల చొప్పున 10 లీటర్ల నాటుసారాను సీజ్ చేశామని ఎస్ఐ జయరాముడు తెలియజేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెల్లడించారు.

ఘన నివాళి

కడప కల్చరల్ : పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ విశ్రాంత ఆచార్యులు ఆచార్య కొర్లకుంట ఆనందన్ మృతి పట్ల సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సంస్థ సంచాలకులు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం బ్రౌన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనందన్ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాల్లో తెలుగుశాఖ ఆచార్యులుగా ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం ఆయన చిత్రపటం వద్ద సిబ్బందితో కలిసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి , బ్రౌన్ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహం



కడప అర్బన్: కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని చేర్పించారు. సర్జికల్ ఐసీయూ వార్డులో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందగా మార్చురీలో వుంచారు. ఎవరైనా ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని రిమ్స్ సిబ్బంది కోరారు..

హెచ్‌ఐవీ పట్ల అవగాహన ఉండాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, అదనపు డీఎంఅండ్ హెచ్ఓ

వైవీయూ : హెచ్‌ఐవీ/ఎయిడ్స్ పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాలలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రెడ్ రిబ్బన్ క్లబ్స్, యూత్ అవేర్‌నెస్ మాస్టర్స్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. ఎస్. రవిబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీ/ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న అధ్యాపకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌రిబ్బన్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ డా. పి. నాగరాజు, డీపీఎం భాస్కర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.


ముమ్మరంగా దిశ యాప్ డౌన్‌లోడింగ్ ప్రక్రియ



దిశ యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్న పోలీసులు, సిబ్బంది

కడప అర్బన్: జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ‘దిశ యాప్’ను పోలీసు అధికారులు, సిబ్బంది శుక్రవారం విస్తృతంగా డౌన్‌లోడ్ చేయించారు. కడప నగరంలో ‘దిశ’ పోలీస్‌స్టేషన్ సీఐ రాజాప్రభాకర్, ఎస్ఐలు లక్ష్మిదేవి, ద్వారక, ఇతర సిబ్బందితో కలిసి విద్యాసంస్థలు, కూడళ్లు, ఇతర ప్రదేశాల్లో విస్తృతంగా పర్యటించారు. కడప రిమ్స్‌లో వైద్య విద్యార్థులు, కడప కోటిరెడ్డి మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తదితర ప్రాంతాల్లో పర్యటించి దిశ యాప్ డౌన్‌లోడ్‌ను, యాప్ ప్రాధాన్యతను వివరించారు. ఆపదలో వున్న సమయంలో ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



పంటలను పరిశీలిస్తున్న పీడీ ఆనంద్‌నాయక్

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చనని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చెన్నంరాజుపల్లె గ్రామ పొలాల్లో ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం తక్కువ ఖర్చుతో అధిక దిగుబడు సాధించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం మోడల్ విజన్ బిల్డింగ్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, ఏరియా కోఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, డీపీఎం హరిప్రసాద్, ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీలు పాల్గొన్నారు.